ఇఫ్తార్ విందు బహిష్కరణ

ఖానాపూర్ టౌన్, మార్చి 29: ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మరిచిపోయి కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో ముస్లింలకు తీవ్ర అన్యాయం చేయడంతో పాటు ముస్లింలపై కక్షపూరితంగా వ్యవహరించడాన్ని నిరసిస్తూ ఖానాపూర్‌లో శనివారం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌ను బహిష్కరించినట్లు బీఆర్ఎస్ మైనార్టీ పట్టణ అధ్యక్షుడు షోయాబ్ హూస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఖానాపూర్‌లోని ఈద్గాకు ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి పనులకు నిధులు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. పట్టణంలో మౌలానా అబ్దుల్ కలాం విగ్రహ ఏర్పాటు విషయంలో జరిగిన ఘటనలో ముస్లిం నాయకుల ఇండ్లలోకి ప్రవేశించి టెర్రరిస్టులైనట్లుగా అరెస్టు చేయడంపై ముస్లిం సమాజం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇదేవిధంగా మైనార్టీ వ్యతిరేక విధానాలు అవలంబిస్తే తప్పకుండా గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

పన్నుల వసూళ్లకు స్పెషల్ డ్రైవ్

ఖానాపూర్, మార్చి 29 : నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి, వ్యాపార పన్ను వసూళ్ల స్పెషల్ డ్రైవ్ జోరుగా కొనసాగుతోంది. శనివారం అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ఆస్తిపన్ను వసూళ్లు చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.2.18 కోట్ల వసూళ్ల లక్ష్యంతో సిబ్బంది కృషి చేస్తుందని తెలిపారు. మున్సిపాలిటీలోని 12 వార్డులకు గాను 4 బృందాలు పన్నులు వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పన్నుల్లో 90 శాతం వడ్డీ మాఫీకి ప్రభుత్వం అవకాశం కల్పించిందని అన్నారు. ప్రజలు విధిగా ఈ నెల 31వ తేదీలోపు వార్డుల్లో మున్సిపల్ అధికారులకు లేదా పురపాలక సంఘ కార్యాలయానికి వచ్చి తమ ఇంటి, వ్యాపార పన్నులు చెల్లించాలని కోరారు.

పరీక్షా కేంద్రం తనిఖీ

పరీక్షా కేంద్రాన్ని పరిశీలించి వస్తున్న ఏఎస్పీ అవినాశ్‌కుమార్

ముథోల్, మార్చి 29 : నిర్మల్ జిల్లా ముథోల్‌లోని ఆశ్రమ, ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని శనివారం భైంసా ఏఎస్పీ అవినాశ్ కుమార్ తనిఖీ చేశారు. విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడవద్దని సూచించారు. పలు వివరాలు ఎస్ఐని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

భవనం కూల్చివేత

కూల్చి వేస్తున్న భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో శివకుమార్

ముథోల్, మార్చి 29: నిర్మల్ జిల్లా ముథోల్‌లోని ప్రభుత్వ దవాఖానలోని భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో విషసర్పాలు వస్తున్నాయని వైద్య సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే భవనాన్ని కూల్చివేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శిథిలావస్థకు చేరుకున్న భవనాన్ని తొలగిస్తున్నట్లు ఎంపీడీవో శివకుమార్ తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

బజార్‌హత్నూర్/బోథ్, మార్చి 29: ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం పిప్పిరి గ్రామానికి చెందిన తండిపెల్లి గంగాధర్‌కు రూ.42 వేలు, బోథ్ మండలం ధన్నూర్(బీ) గ్రామానికి చెందిన మార కిరణ్ కుమార్‌కు రూ.57 వేలు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరయ్యాయి. శనివారం నేరడిగొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జాదవ్ అనిల్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు.కార్యక్రమంలో నాయకులు శ్రీధర్ రెడ్డి, జక్క బాపురెడ్డి, ప్రశాంత్, రవి, భరత్ పాల్గొన్నారు.



బజార్‌హత్నూర్: లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

సమస్యలు పరిష్కరించాలని వినతి

బోథ్, మార్చి 29: బోథ్‌లోని పలు సమస్యలు పరిష్కరించాలని శనివారం గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు నేరడిగొండలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. క్లబ్‌లో లైబ్రరీ ఏర్పాటు చేయాలని, పాత వీడీసీ భవనం పున నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం అందజేసిన వారిలో వీడీసీ అధ్యక్షుడు అల్లకొండ పోతన్న, ప్రధాన కార్యదర్శి సాయినాథ్ గౌడ్, కోశాధికారి రాయిపెల్లి రమాకాంత్, ఉపాధ్యక్షులు సయ్యద్ యాసిన్, ప్రవీణ్, శ్రీధర్ రెడ్డి, ప్రశాంత్, శ్రీనివాస్, సుభాష్ ఉన్నారు.

ఉగాది వేడుకలకు రైతన్నలు బిజీ

బజార్‌హత్నూర్, మార్చి 29: ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలంలో విశ్వావసునామ (ఉగాది) వేడుకలు నిర్వహించుకునేందుకు ప్రజలు, రైతులు నిమగ్నమయ్యారు. శనివారం మండలంలోని బజార్‌హత్నూర్, పిప్పిరి, గిర్నూర్ గ్రామాల్లో రైతులు వండ్రగిల వద్ద వ్యవసాయ పనిముట్ల తయారిలో బిజీబిజీగా కనిపించారు. నూతన పనిముట్లతో వ్యవసాయ భూముల్లో తొలి పూజ చేసి వ్యవసాయ పనులు మొదలు పెట్టడం జరుగుతుందని రైతులు పేర్కొన్నారు.

బజార్‌హత్నూర్‌లో వండ్రగిల వద్ద పనిముట్ల తయారిలో బిజీగా కనిపిస్తున్న రైతులు

తెల్లవారక ముందే అడవీ బాట

● ఇప్పపువ్వుల సేకరణలో ఆదివాసులు బిజీబిజీ

అటవీలో ఇప్పపువ్వులు ఎరుతున్న ఆదివాసులు

నార్నూర్, మార్చి 29 : వేసవికాలం వచ్చిదంటే అడవిలో లభించే ఫలాలు ఆదివాసీలకు జీవనోపాధి కల్పిస్తాయి. అటవీ ప్రాంతాల్లో లభించే పండ్లు, ఇప్పపూలు ఆర్థికంగా ఉపయోగపడుతుంటాయి. ప్రస్తుతం ఇప్పపువ్వుల సేకరణలో గిరిజనులు నిమగ్నమయ్యారు. తెల్లవారకముందే అటవీ బాట పడుతున్నారు. అడవుల్లో సేకరించిన ఇప్పపువ్వులను ఇంటి పరిసరాల్లో ఎండబెట్టి, వర్షాకాలంలో ఇంటి అవసరానికి వినియోగిస్తుంటారు. నార్నూర్, గాదిగూడలో ఆదివాసులు అడవి తల్లి ప్రసాదించే ఇప్పపువ్వుల సేకరణలో బిజీబిజీగా కనిపిస్తున్నారు. అడవుల్లో ఇప్పచెట్లకు పువ్వులు బాగానే పూశాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎండకాలంలో అడవి ప్రాంతంలో లభించే ఉత్పత్తుల సేకరణలో బిజీబిజీగా ఉంటారు. అడవిలో లభించే ఉత్పత్తులతో కొంత ఆర్థికంగా ఉపయోగపడుతున్నాయని ఆదివాసులు పేర్కొంటున్నారు.

అగ్రవర్ణలకేనా మంత్రి, నామినేట్ పదవులు

నార్నూర్, మార్చి 29 : అగ్రవర్ణలకేనా మంత్రి, నామినేట్ పదువులు అంటూ సీఎం రేవంత్‌రెడ్డిని లంబడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు భరత్ చౌహాన్ ప్రశ్నించారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్‌లోని సేవాలాల్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా లంబాడాల జనాభా 40 లక్షలు ఉండగా జూపల్లి కృష్ణారావు 20 లక్షల జనాభా ఉందని ఏ లెక్కల ద్వారా చెప్పారంటూ మండిపడ్డారు. రాబోవు మంత్రివర్గ విస్తరణలో లంబాడాలకు అవకాశం కల్పించి మంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. లంబాడాలకు మంత్రి పదవి ఇవ్వకపోతే సచివాలయం, అసెంబ్లీని ముట్టడించి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో సహకార సంఘం చైర్మన్ సురేశ్, బంజారా సంస్కృతి పరిరక్షణ గౌరవాధ్యక్షుడు దిగంబర్, జిల్లా అధ్యక్షుడు రాథోడ్ పరశురాం,అఖిల భారతీయ బంజారా సేవ సంఘం మండల ప్రధాన కార్యదర్శి రాథోడ్ దిలీప్, మాజీ సర్పంచ్ రాథోడ్ విష్ణు ,యశ్వంత్ చౌహాన్, వసంత్, బాలా మోహన్, అశోక్, మోహన్, గులాబ్‌సింగ్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలు ఎండ నుంచి జాగ్రత్తలు తీసుకోవాలి

దిలావర్‌పూర్, మార్చి 29: ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలు ఎండ నుంచి జాగ్రత్తలు తీసుకోవాలని, ఉదయం పూట పనికి వెళ్లి సకాలంలో ఇంటికి రావాలని డీఆర్డీవో శ్రీనివాస్ సూచించారు. శనివారం నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని న్యూలోలం గ్రామంలో కమ్యూనిటీ ప్లాంటేషన్‌ను ఆయన పరిశీలించారు. అనంతరం కూలీలతో ఆయన మాట్లాడారు. కూలీలు పని నుంచి ఇంటికి వెళ్లిన తర్వాత ఓఆర్ఎస్ పౌడర్ తీసుకోవాలని సూచించారు. ఉదయం పూట పనికి తొందరగా వచ్చి పనులు పూర్తి చేసుకొని ఇంటి వెళ్లాలని అన్నారు. గ్రామ పంచాయతీల్లో తాగునీటి సమస్య లేకుండా చూస్తున్నామని అన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ మహేశ్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్న నిర్మల్ వైద్యులు

నిర్మల్ అర్బన్, మార్చి 29 : నిర్మల్‌లోని దేవిబాయి సూపర్ స్పెషాలిటీ దవాఖాన వైద్యులు చంద్రిక అవినాశ్‌లు రాష్ట్ర స్థాయి ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో గైనాకాలజీ, ఇన్ఫర్టిలిటీ విభాగంలో రోగులకు మెరుగైన సేవలు అందించిందనందుకు గానూ రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు నేరెళ్ల శారద, ఎంపీ రఘునందర్ రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. తనను నిరంతరం ఆదరిస్తున్న తన అభిమానులు, రోగులు, వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

అవార్డు అందుకుంటున్న వైద్యులు

శనీశ్వర ఆలయంలో భక్తుల పూజలు

భైంసా, మార్చి 29 : నిర్మల్ జిల్లా భైంసాలోని శనీశ్వర ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. శనివారం అమావాస్యను పురస్కరించుకుని ఆలయానికి భక్తులు బారులు తీరారు. శనిశ్వరుడికి భక్తులు తైలాభిషేకాలు, అర్చనలు, తదితర పూజలు చేశారు. తమ దోషాలు తొలగిపోవాలని వేడుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

ఒకరిని కాపాడిన పోలీసులు

సోన్, మార్చి 29: నిర్మల్ మండలంలోని చిట్యాల్ గ్రామ శివారులోని వంతెన వద్ద శ్రీకాంత్ అనే వ్యక్తి మనస్థాపానికి గురై వంతెన వద్ద వాగులో దూకేందుకు ప్రయత్నిస్తుండగా నారీశక్తిలో భాగంగా పెట్రోకార్ విధులు నిర్వహిస్తున్న పోలీసులు రజిత, శ్రావళిక, సంతోష్ చేరుకొని కాపాడి వారి బంధువులకు అప్పగించారు.

కారు ఢీ కొని ఒకరు మృతి

సోన్, మార్చి 29: నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామానికి చెందిన కొండ్ర రాంరెడ్డి (39) చేనుకు వెళ్లి తిరిగి తన బైక్‌పై ఇంటికి వస్తుండగా కారు అతివేగంగా వచ్చి బైక్‌ను ఢీ కొట్టడంతో మృతి చెందినట్లు ఎస్సై గోపి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..రాంరెడ్డి బైక్‌పై తోటకు వెళ్లి తిరిగి కడ్తాల్‌కు ఎన్‌హెచ్ 44పై వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీ కొట్టింది. డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. రాంరెడ్డి తలకు, భుజానికి, ఇతర చోట్ల బలమైన గాయలు కావడంతో వెంటనే స్థానికులు దవాఖానకు తరలించేలోపు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కోతుల దాడిలో వీఆర్ఏకు గాయాలు

ఖానాపూర్ టౌన్, మార్చి 29 : నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని తహసీల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వీఆర్ఏ నక్కల పోశవ్వపై కోతులు దాడి చేయడంతో గాయాలయ్యాయి. శనివారం రోజులాగా విధులకు హాజరైన పోశవ్వపై కోతులు దాడి చేసి గాయపర్చగా గమనించిన పలువురు ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స చేయించారు. పట్టణంలో కోతుల బెడద తీవ్రంగా ఉందని అధికారులు చొరవ తీసుకుని కోతుల బెడద నుంచి విముక్తి కల్పించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య

ఇచ్చోడ, మార్చి 29 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం చిన్న సల్యాద గ్రామానికి చెందిన కాత్లే లక్ష్మణ్(40) కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసై ఖాళీగా ఇంటి వద్ద ఉంటున్నాడు. శనివారం ఉదయం పురుగుల మందు తాగి వాంతులు చేసుకుంటుండగా భార్య లక్ష్మి చూసి ఏమైందని అడగగా లక్ష్మణ్ పురుగుల మందు తాగానని తెలిపారు. హుటాహుటిన 108లో రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

పెద్దమ్మ గుడిలో చోరీ

బోథ్, మార్చి 29: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కౌఠ(బీ) గ్రామ సమీపంలోని పెద్దమ్మ గుడిలో శుక్రవారం రాత్రి దొంగలు తాళాలు పగలగొట్టి హుండీ ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం గుడికి వెళ్లిన భక్తులు ఆలయ కమిటీ సభ్యులకు సమాచారం అందించారు. వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఉట్నూర్ రూరల్, మార్చి 29 : ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం బిర్సాయిపేట్ గ్రామ పంచాయతీ పరిధిలోని భూపేట్ గ్రామానికి చెందిన పిట్ల రాజన్న(25) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్ఐ మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. భూపేట్ గ్రామానికి చెందిన పిట్ల పోశన్న, కన్నవ్వలకు నలుగురు కుమారులు, నలుగురు కూతుర్లు. మూడవ కుమారుడు పిట్ల రాజన్న కూలీ పని చేసుకుంటూ కుంటుంబానికి ఆసరగా ఉంటున్నాడు. ఈ క్రమంలో తనకు పెండ్లి కావడంలేదని మనస్థాపంతో గత గురువారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు ఉట్నూర్ దవాఖానకు తరలించి చికిత్స అందించి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతిని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టెట్‌సోర్సింగ్ పోస్టులపై విచారణ జరిపించాలి

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 29 : నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ కళాశాల ఔట్‌సోర్సింగ్ పోస్టుల నియామకం చేశారని 20 ఏళ్లుగా పని చేస్తున్న ఉద్యోగులను తొలగించి ఉద్యోగాలను భర్తీ చేయడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని మెడికల్ ఏజన్సీపై విచారణ జరిపించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ డిమాండ్ చేశారు. శనివారం పోస్టుల అవకతవకలపై విచారణ జరిపించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అవకతవకలకు పాల్పడిన ఏజన్సీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

ఎదులాపురం, మార్చి 29 : ఈ ఏడాది మార్చి 30 వ తేదీన ఉగాది పండుగను జరుపుకుంటామని ఈ సందర్భంగా ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా ప్రజలకు శ్రీ విశ్వావసు నామ సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ సుఖ, సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు.

మేధో సంపత్తి హక్కులపై అవగాహన

నిర్మల్ అర్బన్, మార్చి 29: నిర్మల్‌లోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం స్వయం సహాయ సంఘాల మహిళలకు మేధో సంపత్తి హక్కులపై అవగాహన కల్పించారు. ఎంఎస్ఎంఈ జాతీయ సంస్థ ఫ్యాక్టలీ స్వప్న మాట్లాడుతూ మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు పూర్తి స్థాయి హక్కులు కల్పించేందుకు మేధో సంపత్తి ఉపయోగపడుతుందని ఈ సర్టిఫికెట్ ద్వారా పూర్తిస్థాయి హక్కులు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషర్ జగదీశ్వర్, మెప్మా పీడీ సుభాష్ పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

జైనథ్, మార్చి 29: గోండి ధర్మ గురు హీరాసుక్క జెండాను గుర్తు తెలియని వ్యక్తులు దహనం చేయడాన్ని ఆదివాసీ పర్ధాన్ సమాజ్ నాయకులు తీవ్రంగా ఖండించారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా జైనథ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేస్లాపూర్ నాగోబా దేవస్థానం సమీపంలోని గురు హీరాసుక్క జెండాను గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టారన్నారు. ఈ సంఘటనకు పాల్పడిన దుండగులను వెంటనే గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆదివాసీ పర్ధాన్ భోరజ్ మండలాధ్యక్షుడు దుర్వ అభిమాన్, నాయకులు భాస్కర్, ప్రమోద్, మోహన్, సురేందర్, విఠల్, అఖిల్, భూమన్న, లక్ష్మణ్, గణేశ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత, అవగాహన తప్పనిసరి

ఎదులాపురం, మార్చి 29 : సైబర్ నేరాలపై అప్రమత్తత, అవగాహన ద్వారా అడ్డుకోవడం సాధ్యమవుతుందని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930 కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, లేదా cybercrime.gov.in అనే వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎలాంటి నష్టాన్ని అయినా సైబర్ క్రైమ్ నందు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. పట్టణంలోని ఆదిలాబాద్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏడు ఫిర్యాదులు, రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఒకటి, రూరల్‌లో రెండు, నేరడిగొండ, బేల, ఇంద్రవెల్లి, సిరికొండ, నార్నూర్, బజార్‌హత్నూర్ పోలీస్ స్టేషన్లలో ఒక్కొక్క ఫిర్యాదు వచ్చిందని తెలిపారు.

చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే చర్యలు

నేరడిగొండ, మార్చి 29 : చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామని ఇచ్చోడ సీఐ భీమేశ్ హెచ్చరించారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండలో ఆయన విలేరులతో మాట్లాడారు. రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద వాహనాలు కొందరు ఆపుతున్నట్లు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని టోల్‌ప్లాజా వద్ద ఉదయం ఎటువంటి అధికారం లేకుండా మహారాష్ట్ర నుంచి నిజామాబాద్ వెళ్తున్న ఎద్దుల వాహనాలను అక్రమంగా అడ్డుకున్నారు. వాహనాల డ్రైవర్ జావిద్‌ఖాన్, జుబేర్‌ఖాన్ బెదిరించారు.లారీలో ఎద్దులు కాకుండా ఆవులు ఉన్నాయని లారీలోకి ఎక్కిచూసి లారీ డ్రైవర్లను కొట్టడానికి వెళ్తు వారిని భయభ్రాంతులకు గురిచేశారని తెలిపారు. అలా చేసిన వారిపై కేసు నేరడిగొండ పోలీస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.ఎవరైనా చట్టాన్ని ఉల్లంఘిస్తే ఇచ్చోడ సీఐ భీమేశ్ 8712659936. నేరడిగొండ ఎస్ఐ 6712659947 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు.

గురుకుల జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

నిర్మల్ చైన్‌గేట్, మార్చి 28 : తెలంగాణ రాష్ట్ర గురుకుల జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ డేనియల్ తెలిపారు. 2025-27 విద్యాసంవత్సరానికి గాను ఇంటర్‌లో ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ కోర్సులు బెల్లంపల్లిలో 80, బాలురకు నిర్మల్‌లోని సోఫినగర్ గురుకుల పాఠశాలలో, బాలికలకు ఇంటర్ మీడియట్‌లో ప్రవేశాలకు మే 10వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ఈ నెల 24 నుంచి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజలకు భద్రత కల్పించేందుకే కార్డెన్ సెర్చ్

భైంసా, మార్చి, 29 : శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు సురక్షితమైన భద్రత కల్పించేందుకే కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు ఏఎస్పీ అవినాశ్ కుమార్ అన్నారు. శనివారం నిర్మల్ జిల్లా భైంసాలోని కుంట ఏరియాలో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. సరైన పత్రాలు లేని 52 ద్విచక్రవాహనాలు, 2 ఆటోలను సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సీఐ గోపీనాథ్, ఎస్ఐలు అజయ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కళాశాలల్లో ఆధునిక కోర్సులు ప్రవేశ పెట్టండి

నిర్మల్ అర్బన్, మార్చి 29: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మారుతున్న కాలానికి అనుగుణంగా వచ్చే విద్యా సంవత్సరంలో ఆధునిక కోర్సులు ప్రవేశపెట్టాలని అధ్యాపకులు డీఐఈవో పరశురాంకు వినతి పత్రం అందజేశారు. ఇక్కడ అధ్యక్షుడు ప్రసాద్ కుమార్, రవీందర్, నరహరి అధ్యాపకులు ఉన్నారు.

దస్తురాబాద్ ఎస్ఐగా సాయి కుమార్

దస్తురాబాద్,మార్చి29 : దస్తురాబాద్‌లోనిపోలిస్ స్టేషన్‌లో శనివారం ఎస్ఐగా సాయి కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఆయన నిర్మల్ టౌన్ విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడికి వచ్చాడు. ఇక్కడ ఎస్ఐ గా విధులు నిర్వహించిన సీ అశోక్ బదిలీపై కుంటాల పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు.

అర్చక సంఘం అధ్యక్షుడిగా ఒద్దిపర్తి వంశీ కృష్ణా చార్యులు

దస్తురాబాద్, మార్చి 29 : దస్తురాబాద్ మండలంలోని రేవోజిపేట గ్రామంలోని శ్రీ హరిహర క్షేత్ర ఆలయ ప్రధాన అర్చకులు ఒద్దిపర్తి వంశీకృష్ణా చార్యులు మండల అర్చక సంఘం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మండల అర్చక సంఘం అధ్యక్షుడిగా ఒద్దిపర్తి వంశీ కృష్ణాచార్యులను ఏకగ్రీవంగా నియమించినట్లు ధూప దీపా నైవేద్య పథకం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు యోగేశ్ శర్మ తెలిపారు. అర్చకులు ఒద్దిపర్తి వంశీ కృష్ణాచార్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

ఫొటోగ్రాఫీ అసోసియేషన్ కార్యవర్గం

బోథ్, మార్చి 29 : ఆదిలాబాద్ జిల్లా బోథ్, సొనాల మండలాల ఫొటో, వీడియోగ్రాఫీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బుస లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా ముప్కాల రాజేశ్వర్, ఉపాధ్యక్షులుగా దండారి రంజిత్, కోశాధికారిగా కే గణేశ్, గౌరవాధ్యక్షుడిగా సదాశివ్, సలహాదారులుగా కే రోహిత్, జీ దేవేందర్, పీ నితీశ్‌గౌడ్ ఎన్నికయ్యారు.

బుస లక్ష్మణ్

తానికాయలు అందజేత

తానికాయలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్

ఇచ్చోడ, మార్చి 29 : ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, వృక్ష శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ మధు ఆధ్వర్యంలో శనివారం సిరిచెల్మ అటవీ క్షేత్ర అధికారులు నాగవత్ స్వామి, టీ పుండలిక్‌కు విద్యార్థులు సేకరించిన తానికాయలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తానికాయలు అడవిలో లభించే అరుదైన అటవీ జాతి తానిచెట్ల నుంచి లభిస్తాయన్నారు. ఈ తానికాయలు త్రిఫల చూర్ణ తయారీలో వాడతారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సరస్వతి, డాక్టర్ మురళి, డాక్టర్ అనిత, టీ నర్సయ్య, సరిత రాణి పాల్గొన్నారు.

జిల్లా విద్యాధికారిగా ఎన్‌వీ దుర్గ ప్రసాద్

ఎదులాపురం, మార్చి 29: ఆదిలాబాద్ జిల్లా విద్యా అధికారిగా తెలంగాణ డిప్యూటీ డైరెక్టర్‌గా పని చేస్తున్న ఎన్‌వీ దుర్గ ప్రసాద్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా విద్యా అధికారి టీ ప్రణీత ఈనెల 31 తేదీన ఉద్యోగ విరమణ చేయనున్నారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన

సోన్, మార్చి 29: నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, సోన్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని పరీక్షల సహాయ కమిషనర్ ముడారపు పరమేశ్వర్ శనివారం పరిశీలించారు. అక్కడి సీఎస్, డీవోలకు పలు సూచనలు చేశారు. విధులపై జాగ్రత్తగా ఉండాలని